క్లుప్తంగా

నేడు ప్రజా ప్రతినిధుల సమావేశం

గుంటూరు రూరల్: గుంటూరు రూరల్ మండలం పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్లు, ముఖ్య నాయకుల సమావేశాన్ని బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని గుజ్జనగుండ్ల సెంటర్ నందున్న జెడ్పీటీసీ కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. కావున ప్రతి ఒక్కరూ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా రాజకీయ కూటమి సదస్సును జయప్రదం చేయండి

గుంటూరు రూరల్: విజయవాడలోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో సెప్టెంబరు 3న నిర్వహించనున్న ప్రజా రాజకీయ కూటమి రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ పోలిట్ బ్యూరో సభ్యుడు కూటమి కో–కన్వీనర్ మన్నవ హరిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగం, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిందని, ప్రజా సంక్షేమం కోసం ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమాజ సేవలో చలపతి ఐటీ హబ్ విద్యార్థులు



గుంటూరు రూరల్: విద్యార్థులు చిన్ననాటి నుంచి సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం లాం నందున్న కళాశాల విద్యార్థులు నగరంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డులో గల హ్యాపీకేర్ ఓల్డేజ్ హోంలో వయో వృద్ధులకు నిత్యావసర సరుకులు, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సమాజంపై అవగాహన, సేవా దృక్పథం కలిగి సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. అనంతరం ఆశ్రమానికి నెలకు సరిపడా బియ్యం, నూనె, కందిపప్పు, కూరగాయలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల సీఎస్ఐటీ విభాగాధిపతి జె.భార్గవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేర్ డెంటల్ కళాశాలలో ఓనం వేడుకలు



గుంటూరు రూరల్: పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేసే మంచి రోజులని కేర్ డెంటల్ కళాశాల చైర్మన్ డాక్టర్ సయ్యద్ రసూల్ అన్నారు. పాత్తూరు గ్రామంలోని కేర్ డెంటల్ సిస్టర్ కేర్ కళాశాలలో ఓనం పండుగ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచ దేశాలకు మార్గదర్శకమైనవని తెలిపారు. విద్యార్థినులకు వివిధ రకాల క్రీడలు, పాటలు, పోటీలను నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ధనలక్ష్మి, జీవతార, సమీన, మొహిద్దీన్, శాంత, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్శిటీలో గేమ్స్ మీట్

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీలో జాతీయ క్రీడా దినోత్సవం, ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ గేమ్స్ మీట్ మంగళవారం ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా బాస్కెట్‌బాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ మీట్‌లో వివిధ జట్లు పోటీ పడ్డాయి. కబడ్డీ పోటీల్లో విజ్ఞాన్ యూనివర్సిటీ విజేతగా, కేఎల్ యూనివర్సిటీ రన్నరప్‌గా నిలిచాయి. హాకీ ఆరంభ మ్యాచ్‌లో విజ్ఞాన్–ఏ టీమ్ విజేతగా, విజ్ఞాన్–బీ టీమ్ రన్నరప్‌గా నిలిచాయి. విజేతలకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వీసీ పి.నాగభూషణ్ మాట్లాడుతూ యూనివర్శిటీలో మూడు సెమిస్టర్‌లలో స్పోర్ట్స్‌కు సంబంధించిన అంశాలకు మార్కులు కూడా కేటాయించామన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని ఆంజనేయపేటలోని వీరాంజనేయస్వామి దేవాలయం పునః నిర్మాణం, విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహి స్తున్నారు. మంగళవారం సేవాసమితి చైర్మన్ బద్దిగం కోటిరెడ్డి, ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో విఘ్నేశ్వర స్వామి, వీరాంజనేయస్వామి, అయ్యప్పస్వామి, జంటనాగులు, ధ్వజ, శిఖర కలశాల ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా విశేష హోమాలు, పూజలను వేదమంత్రాల నడుమ రుత్విపకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం విశేషంగా పాల్గొన్న భక్తులతో మేళతాళాలతో శోభాయాత్ర నిర్వహించారు. చైర్మన్ కోటి రెడ్డి మాట్లాడుతూ బుధవారం ఉదయం 10.55 నిమిషాలకు విగ్రహ ప్రతిష్ఠలు జరుగుతాయని తెలిపారు.

సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- మామిళ్లపల్లిలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

మామిళ్లపల్లి(చేబ్రోలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు రూరల్ మండలం మామిళ్లపల్లి గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కిలారి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలోని ప్రతి వీధిలో పర్యటిస్తూ అందరినీ ఆత్మీయంగా పలకరిస్తూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యలను ఎమ్మెల్యే కిలారి అక్కడక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జాలాది యానాదిరావు, ఎంపీటీసీ పోలూరి శ్రీనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లంకపోతు పిచ్చిరెడ్డి, బీమానంద్, ఎంపీపీ భవనం పద్మలీల, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరావు, భవనం వంశీరెడ్డి, రుద్రపాటి ఆదిశేషు, విద్యాసాగర్, రఘురాం, సిలార్ బాషా, హరిబాబు, మండలస్థాయి, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

తెలుగు భాషను రక్షించుకోవాలి



ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు



నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం ఎన్.తిరుపతిరావు

కొండపాటూరు(కాకుమాను): తెలుగు భాషను పరిరక్షించుకోవల్సిన బాధ్యత తెలుగు ప్రజలందరిపై ఉందని ఎంపీడీఓ పి.రామకృష్ణ అన్నారు. ఆధునిక తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా కొండపాటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శీలం అంకారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ ఆంగ్ల భాషపై మమకారంతో మాతృభాష తెలుగును నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. మాతృభాషలోనే భావవ్యక్తీకరణ, అవగాహన సులభంగా ఉంటుందని వివరించారు. తెలుగు పద్యాలు, కథలు, కవితలు, పాటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల జాతీయ నాయకుల వేషధారణలు, వివిధ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓలు కేఎఫ్.కెనడీ, విజయ్ భాస్కర్, హెచ్‌ఎం శీలం అంకారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి విశేష కృషి..

పెదకాకాని: తెలుగు భాష గొప్పతనాన్ని చాటిచెప్పిన గిడుగు రామ్మూర్తి సేవలు అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు అన్నారు. వెనిగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాషాదినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు నివాళులర్పించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల డైరెక్టర్ మాలెపాటి శ్రీనివాస్



జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావును అభినందిస్తున్న ప్రిన్సిపల్ మల్లికార్జునరెడ్డి

పెదనందిపాడు: పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు భాష, జాతీయ క్రీడోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వీర రాఘవయ్య మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహారిక భాష ఉద్యమాన్ని నడపడానికి నాటి సమాజంలోని పరిస్థితులను వివరించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రపంచ అత్యుత్తమ హాకీ క్రీడాకారులలో ధ్యాన్‌చంద్ ఒకరని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం

గుంటూరు రూరల్: క్రీడారంగంలో భారతదేశ కీర్తిని, దేశభక్తి నిరతిని చాటుకున్న క్రీడా మాంత్రికుడు ధ్యాన్ చంద్ అని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధ్యాన్ చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. కళాశాలలో అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి, విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ధ్యాన్ చంద్ ఒలింపిక్స్‌లో వరుసగా మూడు సార్లు బంగారు పతాకాన్ని సాధించి, జాతీయ జెండాను రెపరెపలాడించిచారని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ తెలిపారు. భారతదేశ ఆర్మీలో పనిచేస్తూనే భారత క్రీడా రంగ కీర్తిని చాటిన మహనీయుడు ధ్యాన్ చాంద్ అని కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ కొనియాడారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ ఆట తీరును మెచ్చుకున్న జర్మన్ నియంత హిట్లర్ కూడా తన దేశ సైన్యం లో మంచి పదవి ఇస్తానని, తన దేశం తరఫున హాకీ ఆడమని కోరినా ఆయన సున్నితంగా తిరస్కరించి దేశభక్తిని చాటుకున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, పీడీలు డాక్టర్ పి.గౌరిశంకర్, డాక్టర్ ఎం.శివరామకృష్ణ పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

చేబ్రోలు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ఆర్‌వీఐటీ కళాశాల డైరెక్టర్ మాలెపాటి శ్రీనివాస్ అన్నారు. చేబ్రోలులోని ఆర్‌వీఐటీ కళాశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకొని కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, త్రో బాల్ పోటీలు నిర్వహించి, విజేతలకు మెమోంటోలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడల్లో దేశానికి వరుసగా మూడు సార్లు స్వర్ణపతకాలను తీసుకువచ్చిన ఘనత ధ్యాన్‌చంద్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పీడీ శివన్నారాయణ, వైస్ ప్రిన్సిపల్ పట్టాభి అంజిబాబు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీవీఐటీలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

పెదకాకాని: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ అని గుంటూరు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో జి.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొని, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ క్రీడల వల్ల గ్రాహకశక్తి, జ్ఞాపకశక్తి, సహనం పెరుగుతుందని తద్వారా చదువు చక్కగా సాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, ఫిజికల్ డైరెక్టర్స్ డాక్టర్ ఎస్.అరుణ్ కుమార్, డాక్టర్ ఎం.గిరిధర్, ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ ఆళ్ల శ్రీవాణి, బిబన్ బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రన్సిపల్ వీర రాఘవయ్య



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కళాశాల యాజమాన్యం

శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలి

పెదకాకాని: మండలంలోని తక్కెళ్ళపాడు గాంధీనగర్ వాసులకు సుమారు 28 సంవత్సరాల క్రితం పంచాయతీ తీర్మానం చేసి 65 సెంట్లు శ్మశాన వాటికకు కేటాయించింది. కాలక్రమేణ ఆ మార్గంలో ఉన్న కాలువ పూడిక తీయడం, పక్కనే ఉన్న దారిని స్థానిక రైతులు పొలంలో కలుపుకోవడంతో శ్మశానానికి వెళ్లడం ఇబ్బందిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్వే చేసి శ్మశానానికి వెళ్ళే రోడ్డును ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు.

ఎమ్మెల్యే రోశయ్యపై అసత్య ఆరోపణల ఖండన

చేబ్రోలు: పొన్నూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేయబడిన వ్యక్తి కొందరు ప్రతిపక్ష నేతలతో కలిసి ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యపై చేస్తున్న తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మన్నవ గ్రామ సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు తెలిపారు. పొన్నూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మన్నవ గ్రామంలో ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వలంటీర్ల పట్ల దురుసుగా వ్యవహరించి, కులం పేరుతో దుర్భాషలాడారని చేసిన ఆరోపణలు అసత్యమన్నారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యపై వైఎస్సార్ సీపీ నుంచి సస్పెన్షన్‌కు గురైన వ్యక్తి ప్రతి పక్షాలతో చేతులు కలిపి, బురద చల్లే కార్యక్రమానికి పాల్పడుతున్నారని వారు ధ్వజమెత్తారు. పొన్నూరులో 25 సంవత్సరాల్లో చేయలేని అభివృద్ధిని ఎమ్మెల్యే రోశయ్య నాలుగేళ్లలో చేసి చూపించారని తెలిపారు. సమావేశంలో మన్నవ గ్రామ సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల రాజు, మాజీ సర్పంచ్ రుద్రపాటి ఆదిశేషు, గుమ్మడి వినోద్, వెలిచర్ల ప్రసాద్, పుట్ల సంపత్, గేరా సంజీవ్, పిల్లి మాణిక్యరావు, కర్రి రమేష్, ఎంపీటీసీ తలతోటి బాబురావు, మిక్కిలి రామస్వామి, అన్నవరపు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో నవజాత శిశు సంరక్షణ కేంద్రం అభివృద్ధి



గుంటూరు మెడికల్: జీజీహెచ్ చిన్నపిల్లల వైద్య విభాగం, నవ జాత శిశు చికిత్స, సంరక్షణ కేంద్రాన్ని రూ.80 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. మంగళవారం పిల్లల వార్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నవ జాత శిశు సంరక్షణ కేంద్రంలో ప్రస్తుతం 20 పడకలు ఉన్నాయని చెప్పారు. వీటికి అదనంగా మరో 20 పడకలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మరో పది రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. సూపరింటెండెంట్ వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, పిడియాట్రిక్ వైద్యులు రమేష్, మోహన్ చంద్ర, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



పట్నంబజారు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే లాడ్జిల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌ఐ షేక్ అన్వర్ బాషా హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని లాడ్జి యజమానులు, మేనేజర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. లాడ్జిల్లో వ్యభిచారం, మద్యపానం, పేకాట వంటివి జరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని వారికి స్పష్టం చేశారు. రూమ్ కోసం వచ్చే వారి ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని తెలిపారు. వాటిని నిత్యం స్టేషన్‌కు తెలియజేయాలని ఎస్‌ఐ చెప్పారు. విద్యార్థులు, మైనర్‌లకు సరైన కారణం లేకుండా గదులు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో భాగంగానే ఈ నెల 28న రాజాగారితోటలోని ఓ లాడ్జిలో లాడ్జి నిర్వాహకుడు గాజుపల్లి వెంకటరెడ్డి, రూమ్ బాయ్ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలుసుకుని, అరెస్టు చేసినట్లు గుర్తుచేశారు.

పురుషులతో సమానంగా రాణిస్తున్న మహిళలే మహారాణులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



పాల్గొన్న మహిళలు

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- వడ్లమూడిలో నియోజవర్గస్థాయి వైఎస్సార్‌సీపీ మహిళానేతలతో సమావేశం

చేబ్రోలు: పురుషులతో పాటు సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు మహారాణులని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. మండలంలోని విజ్ఞాన్ యూనివర్శిటీ ఎదురుగా ఉన్న కృష్ణా గార్డెన్స్‌లో మంగళవారం మహిళలు – మహారాణులు కార్యక్రమం జరిగింది. పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని పొన్నూరు, పెదకాకాని, చేబ్రోలు మండలాలకు చెందిన మహిళా ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ మహిళా నేతలు సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమానికి చేబ్రోలు ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో 50శాతానికి పైగా పదవులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. పొన్నూరు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో ఇద్దరు ఎంపీపీలు, ఇద్దరు జెడ్పీటీసీలు మహిళలే ఉండటం ఇందుకు నిదర్శనమన్నారు. సర్పంచ్‌లు, నామినేటెడ్ స్థానాల్లోనూ మహిళలకు అగ్రస్థానం కల్పిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ దేనన్నారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. రూ.2.16లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా ఖర్చులతో దుర్వినియోగం చేసిందని ఎమ్మెల్యే కిలారి విమర్శించారు. టీడీపీ నేతలు ప్రజలను పక్కదారి పట్టించి, మభ్యపెట్టి, మోసగించేందుకు దుష్ప్రచారాలను చేస్తున్నారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత స్త్రీ శక్తిపై ఆధారపడి ఉందన్నారు. టీడీపీ నేతల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. నియోజకవర్గ పరిశీలకులు అన్నాబత్తుని సదాశివరావు మాట్లాడుతూ చంద్రబాబు ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పొన్నూరు ఎంపీపీ భవనం పద్మలీల, పెదకాకాని జెడ్పీటీసీ గోళ్ల జ్యోతి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భవనం విజయలక్ష్మి, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. సమావేశానికి నియోజకవర్గంలోని పంచాయతీ వార్డు మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి



చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ, ఎంపీడీఓ

రేటూరు(కాకుమాను): బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంఈఓ కెఎఫ్ కెనడీ అన్నారు. రేటూరు ఎస్టీ కాలనీలో మంగళవారం అధికారులు బడి బయట పిల్లలను గుర్తించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ ఆరేళ్లు నిండిన ప్రతి చిన్నారి బడిలోపల ఉండాలని, తల్లిదండ్రులు తమ చిన్నారులను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలని కోరారు. నేడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పించడంతో పాటు ఏటా అమ్మ ఒడి పథకం ద్వారా నగదును విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో జమచేస్తున్నట్లు ఆయన తెలిపారు. బడి బయట ఉన్న పలువురు చిన్నారులను గుర్తించి, వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.రామకృష్ణ, ఎంఈఓ–2 కొల్లి విజయ్ భాస్కర్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత లక్ష్య సాధన దిశగా కృషిచేయాలని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ అన్నారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న చిప్సొయిరీ– 2023 వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యాలు సాధించాలన్నారు. జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో గుంటూరు, ప్రకాశం, కృష్ణ, పల్నాడు జిల్లాలకు చెందిన 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీకి చెందిన సన్ ఫార్మా కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ వి.రామకృష్ణ, కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర, కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీ కళాశాల విద్యార్థినికి గోల్డ్‌మెడల్



విద్యార్థిని ఎం.మౌనిక

గుంటూరు రూరల్: నైపుణ్యతలతో కూడిన విద్యా విధానం, లక్ష్య సాధన దిశగా కృషి చేయటం ద్వారానే తమ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ఉన్నత స్థానంలో ఉన్నారని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు అన్నారు. నగర శివారులోని లాం నందున్న కళాశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో తమ కళాశాలలో బీఫార్మసీ కోర్స్‌లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థిని ఎం.మౌనికకు ఆలపాటి జయశ్రీ మెమోరియల్ గోల్డ్ మెడల్ లభించిందని తెలిపారు. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వీసీ పి.రాజశేఖర్ చేతుల మీదుగా అందుకోవటం జరిగిందన్నారు. 2018లో అత్యధిక మార్కులు సాధించినందుకు ఈ అవార్డును ప్రదానం చేశారని వెల్లడించారు. అధ్యాపక బృందానికి చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అభినందనలు తెలిపారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి



అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కొండపాటూ(కాకుమాను): కొండపాటూరులో వేంచేసి ఉన్న స్వయంభూ పోలేరమ్మ తల్లి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని దేవాదాయ శాఖ కర్నూల్ జల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సతీష్ అన్నారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థాన కార్యాలయంపై నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి మొక్కులు తీర్చుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతిరోజూ అనేక మంది భక్తులు వస్తుంటారని ఆయన తెలిపారు. భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు రూ.27 లక్షల వ్యయంతో అదనపు గదులను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి రాజీలేకుండా భక్తులకు అన్ని రకాల వసతులతో నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన ఆదేశించారు. దేవస్థానం పరిసర ప్రాంతాల్లో డ్రెయినేజీ అస్తవ్యస్థంగా ఉండడంతో భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని దేవాలయ చైర్‌పర్సన్ రామినేని నాగవేణి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ప్రతిపాదనలు రూపొందించి నివేదికను అందజేయాలని ఈఓ సురేష్‌బాబుకు ఈఈ సూచించారు. రామినేని తిరుపతిరావు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జనార్దన్, అసిస్టెంట్ ఇంజినీరు చక్రధర్, ట్రస్ట్ బోర్డు సభ్యులు మండవ శ్రీనివాస్, జి.నాగేశ్వరరావు, పి.రమేష్‌బాబు, గ్రామస్తులున్నారు.